క్లుప్తంగా

తీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



పూడిమడక వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అచ్యుతాపురం(అనకాపల్లి): సముద్ర తీరంలోని నిషేధిత ప్రాంతాల వద్ద యువత, ప్రజలు స్నానాలు చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని మెరైన్ ఎస్ఐ మల్లేశ్వరరావు హితవు పలికారు. తంతడి నుంచి కొత్తపట్నం వరకూ తీర ప్రాంతంలో 25 చోట్ల మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో, హెటిరో కంపెనీ సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్ఐ మల్లేశ్వరరావు, స్వీటీ రెడ్డిలు అక్కడి వారికి అవగాహన కల్పించారు. ఏఎస్ఐ రాజు, నాయుడు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

మునగపాక : కుష్ఠు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. ఒంపోలులో బుధవారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంపై మచ్చలు ఉంటే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎం.ఉమమాహేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోకు సత్కారం



డిప్యూటీ డీఈవో అప్పారావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఎస్.రాయవరం: మండలంలో ఎంఈవో 1 గా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.అప్పారావుకు యలమంచిలి డిప్యూటీ డీఈవో పదోన్నతి రావడంతో మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తిమ్మాపురం గ్రామంలో అప్పారావు నివాసం వద్ద దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సుదీర్ఘంగా ఉపాధ్యాయులుగా సేవలందించి, పలుమార్లు ఇన్‌ఛార్జ్ ఎంఈవోగా పని చేశారు. ఆయనను సత్కరించిన వారిలో పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ ఎస్.రాయవరం,నక్కపల్లి మండల అధ్యక్షులు ఆర్ వీరభద్రరావు, టి.వి.రమణ కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడు ఆటోలకు జరిమానాలు



ఓవర్ లోడుతో వెళుతున్న ఆటో డ్రైవర్‌కి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ప్రసాద్‌రావు

ఎస్.రాయవరం : పాఠశాల విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించి ఓవర్ లోడుతో ప్రయాణించే ఆటోలపై చర్యలు తప్పవని ఎస్ఐ ప్రసాద్‌రావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో అడ్డురోడ్డు, కొరుపోలు, తిమ్మాపురం, పెదగుమ్ములూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో 11 ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.22,000 అపరాధ రుసుము వసూలుచేశామన్నారు. ఇకపై ఈ డ్రైవ్‌లు నిత్యం జరుగుతాయన్నారు. ఒక్కసారి పట్టుబడిన ఆటో మరో మారు దొరికితే సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

రూ.16 లక్షలతో తాగునీటి పనులు

రాంబిల్లి: కొత్తపేటలో బుధవారం జల్‌జీవన్‌మిషన్ పనులను సర్పంచ్ వానపల్లి అరుణలత జగన్ ప్రారంభించారు. రూ.16 లక్షలతో జల్‌జీవన్‌మిషన్ పథకంలో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి అప్పలరాజు, సచివాలయ కన్వీనర్ పి.బాబూరావు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య దీపికలు



జగనన్న ప్రభుత్వం వచ్చాక గ్రామం/వార్డు స్థాయిలో సమగ్ర అభివృద్ధికి, ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధికి భరోసా కల్పించేలా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డు నుంచి కులధ్రువీకరణ పత్రం వరకూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన నవరత్న పథకాలు అర్హులకు చేరేలా, ప్రతి అవసరానికి మండల కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పని లేకుండా సచివాలయాలు ప్రజల అవసరాలు తీరుస్తున్నాయి. ప్రజా సంక్షేమానికి భరోసాగా నిలుస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సచివాలయ వ్యవస్థ రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేస్తోంది.



నాపేరు గొల్లు చిట్టిబాబు, కె.వెంకటాపురం గ్రామం. నాతో పాటు గ్రామస్తులంతా ఇది వరకు మండల కేంద్రానికి వెళ్లి ఒక్కో పని కోసం ఒక్కో కార్యాలయానికి వెళ్లి అవస్థలు పడేవాళ్లం. ఇపుడు దాదాపు అన్ని ప్రభుత్వ సేవలు గ్రామ సచివాలయంలోనే లభ్యమవుతున్నాయి. దాంతో ప్రతి ఒక్కరికీ వ్యయ ప్రయాసలు తగ్గాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం.

మండలంలో సచివాలయ వ్యవస్థ

పంచాయతీలు	25
సచివాలయాలు	19
సచివాలయ సిబ్బంది	124
వలంటీర్లు	327

భవన నిర్మాణాలకు నిధులు

సచివాలయాల భవనాలు	19
పూర్తయినవి	18
ఒక్కో భవనానికి వ్యయం	రూ.25 - 40 లక్షలు



సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది

- సచివాలయాలు అభివృద్ధికి సోపానాలు
- సమస్త సేవలు ప్రజల ముంగిటకే
- రేషన్‌కార్డు నుంచి రిజిస్ట్రేషన్‌ల వరకూ..
- అందుబాటులో 12 శాఖల సిబ్బంది
- వలంటీర్లతో ఇంటి వద్దకే పథకాలు
- సత్వరమే సమస్యల పరిష్కారం

కోటవురట్ల: ప్రజలకు కావలసిందేంటి..పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే..వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే..ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం తప్పనిసరి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అదే చేశారన్న వాదన నిపుణుల నోట వినిపిస్తున్న మాట. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల ఇబ్బందులు చూశారు. వారి ఆశలు విన్నారు. ఎవరికి ఏమేం కావాలో బేరీజు చేసి నవరత్న సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారు. వాటిని ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. పాలనా సౌలభ్యం కోసం ప్రతి రెండువేల జనాభాకు గ్రామ సచివాలయాన్ని నెలకొల్పారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మండలంలో సంక్షేమం క్రమం తప్పకుండా ప్రతి కుటుంబానికి అందింది. ఇచ్చిన హామీలను దాదాపు వంద శాతం నెరవేర్చారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సచివాలయ వ్యవస్థకు మూలస్థంభం అధునాతన భవనాలు, మౌలిక సదుపాయాలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాలకు రూ.కోట్లు వెచ్చిస్తోంది. మండలంలో ఇప్పటికే సచివాలయ భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభమయ్యాయి. మండలంలో 19 గ్రామ సచివాలయాలు ఉండగా ఇందులో 18 భవనాలు పూర్తయ్యాయి. ఒక భవనం నిర్మాణదశలో ఉంది. 8 సచివాలయ భవనాలు ప్రారంభం కాగా ఇందులో సేవలు అందుతున్నాయి. మరో 10 భవనాలు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని జనాభా ప్రాతిపదికన టైప్-1, టైప్-2 గా విభజించి నిధులు మంజూరు చేశారు. టైప్-1 సచివాలయ భవనాల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.40 లక్షలు, టైప్-2 భవనాలకు రూ.25 లక్షలు వెచ్చిస్తున్నారు. టైప్-1లో 5 భవనాలు, టైప్-2లో 14 భవనాలను నిర్మిస్తున్నారు.



శైలాడపట్నం గ్రామ సచివాలయ భవనం

సకాలంలో ప్రభుత్వ సేవలు



గ్రామ సచివాలయాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులకు కూడా ఇక్కట్లు తప్పాయి. ఏ సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయంలో దొరుకుతోంది. రిజిస్ట్రేషన్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ భవనాలు కూడా అద్భుతంగా ఉన్నాయి.
– ఆర్.ఎస్. సత్యనారాయణరాజు, తంగేడు

అందే సేవలు ఇవీ...

- **గ్రామ సచివాలయాల** ద్వారా 542 రకాల సేవలు అందుతున్నాయి. వీటిని మరింత విస్తృతపరిచేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు కసరత్తు చేస్తూ అదనపు సేవలను కలుపుతోంది.
- దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే బియ్యం కార్డులు, పింఛన్లను, ఇరవై రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేస్తున్నారు.
- ప్రజలు ఇంటి దగ్గర కూర్చునే దరఖాస్తు చేసుకునేలా గ్రామ, వార్డు సచివాలయాల వెబ్‌సైట్‌ను ప్రభుత్వం రూపొందిస్తోంది.
- ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, సదరం దరఖాస్తు, 1బి, అడంగల్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల నమోదు, టైటిల్ డీడ్, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీ, విద్యుత్ కనెక్షన్ కేటగిరీ మార్పు, ఇంటి స్థలం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, అన్ని రకాల పింఛన్లు, వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపునేస్తం, వైఎస్సార్ బీమా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న తోడు, వాహన మిత్ర తదితర సేవలు ఒకేచోట అందుతున్నాయి.
- ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థుల ధ్రువపత్రాలు అందిస్తున్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- ఏటికొప్పాకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



ఏటికొప్పాకలో పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



తులసీనగర్ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు చట్టసభల్లో స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం మండలంలో ఏటికొప్పాక గ్రామంలో పర్యటించారు. గ్రామ సచివాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణితో కలసి ఆవిష్కరించారు. ఏటికొప్పాక గ్రామంలో చేసిన అభివృద్ధిని గురించి ప్రజలకు వివరించారు. సామాజిక న్యాయం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం అని, నవరత్నాలు పథకాలు ద్వారా పేదలందరికీ ఉచితంగా ఇళ్లు, రైతు భరోసా, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు పథకాలను చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, సచివాలయ మండల కన్వీనర్ వీసం వాసు, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కరణం రవి, రమణబాబు, ప్రతాప్ బాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక లబ్ధి

రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ తులసీనగర్ వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ కుమార్‌తో కలసి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అభివృద్ధి డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రజలందరూ సంక్షేమ పథకాలు దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించాలని అన్నారు.

యలమంచిలి నియోజకవర్గంను అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ తులసీనగర్ వార్డు సచివాలయంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిచామని, ప్రతి ఒక్కరికి ఏదో పథకం రూపంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం ఉపేక్షించం

- గంజాయి అమ్మకాలు, వినియోగంపై నిఘా
- మీడియా సమావేశంలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ హెచ్చరించారు. మద్యం సేవించి ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తే పౌరులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలాంటి మందుబాబులపై జరిమానాలు, కేసులు నమోదు చేస్తామన్నారు. బుధవారం యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుట్టుగా గంజాయి విక్రయాలు జరిపే పెడ్లర్లను గుర్తించడానికి ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం సేవించడం నేరమని సూచించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్ఐ పాపినాయుడుని ఆదేశించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి అందరూ దూరంగా ఉండాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టి ఉండాలని సూచించారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల్ని పరిమితికి మించి ఆటోల్లో తీసుకెళ్లడం సురక్షితం కాదని, కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే ప్రయాణించాల్సిన ఆటోల్లో 10 నుంచి 15 వరకు పిల్లలను కిక్కిరిసి తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వకూడదని, అలా ఇచ్చినప్పుడు ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై కేసులు పెడతామని చెప్పారు. ఇందుకు ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. హైవే పక్కన, ఇతర ప్రాంతాల్లో గల దాబాలు, హోటళ్ల వద్ద కూడా ఎవరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యలమంచిలి మండలం పులపర్తిలో ఇటీవల అదృశ్యమైన తాడేల కొండలరావు హత్య కేసును ఛేదించడంలో యలమంచిలి పోలీసులు చక్కగా దర్యాప్తు చేశారని చెప్పారు. ఈ మేరకు సీఐ సహా ఎస్ఐలకు రివార్డు కోసం సిఫారసు చేస్తానని చెప్పారు. ఆయన వెంట సీఐ షేక్ గఫూర్, ఎస్ఐలు సన్నిబాబు, బాపినాయుడు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావడం తథ్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగపాక సచివాలయం-2 లో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీలు రాము, గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, సచివాలయాల కన్వీనర్లు కొండలరావు, బొడ్డేడ మహేష్, భీశెట్టి ధనశ్రీను, పార్టీ మండల అధికార ప్రతినిధి కాశీబాబు పాల్గొన్నారు. మునగపాక సంతబయిల మార్కెట్ వద్ద పార్టీ జెండాను మండల పార్టీ కన్వీనర్ అచ్చియ్యనాయుడు ఆవిష్కరించారు.

కొండకర్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



కొండకర్లలో కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అచ్యుతాపురం(అనకాపల్లి) : కొండకర్ల గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. కొండకర్ల సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి జగన్ అవసరాన్ని వివరిస్తూ ప్రచురించిన పుస్తకాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, మండల నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన లచ్చన్నాయుడు, పిన్నంరాజు వాసు, కోట్ని శివ, కట్టమూరి శివ, ధూళి నూకరాజు, బి.ప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు వెన్నుదన్నుగా జగనన్న



సుంకపూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు తదితరులు

కోటవురట్ల: రాష్ట్ర ప్రజలకు ఆసరాగా ఉంటూ వెన్నుదన్నుగా ఉన్నందుకే ఆంధ్రప్రదేశ్‌కి జగనే కావాలని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. సుంకపూరు గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఆ గ్రామానికి సమకూరిన లబ్ధిని వివరిస్తూ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించి గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ సిహెచ్.కాశీలక్ష్మి, ఎంపీటీసీ రాంబాబు, ఉప సర్పంచ్ సన్యాసినాయుడు, పార్టీ నాయకులు బాపన్నాయుడు, పాత్రునాయుడు, శింగంపల్లి కిషోర్, రమణమూర్తి, కిషోర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గుర్రాజుపేటలో..

ఎస్.రాయవరం : గ్రామాల్లో మరింత మంచి జరగాలంటే భవిష్యత్‌లో కూడా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు రామరాజు అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ లబ్ధి వివరాలతో ఫ్లెక్సీని సచివాలయం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు.

రేషన్ వాహనాలకు త్వరలో జీపీఎస్



ఆపరేటర్లతో సమావేశమైన తహసీల్దార్

నక్కపల్లి : ప్రభుత్వం ప్రతి నెలా సబ్సిడీపై ఇచ్చే నిత్యావసర సరకులు ప్రతి లబ్ధిదారుడి ఇంటివద్దకు తీసుకెళ్లి అందించాలని తహసీల్దార్ ఎస్.వి.అంబేద్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మొబైల్ డెలివరీ యూనిట్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆపరేటర్లు వాహనాలను కార్డుదారుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లకుండా కూడళ్లలో ఉంచి అక్కడకు కార్డుదారులను పిలిచి సరుకులు పంపిణీ చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్డుదారులకు సరుకులు నేరుగా ఇళ్ల వద్దకే తీసుకెళ్లి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్డుదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. వచ్చేనెల నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందన్నారు. వలంటీరు సూచనల మేరకు ఐదు నుంచి పది మంది కార్డుదారులకు ఒక చోట సరుకులు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్డుదారులు, వలంటీర్ల వెసులుబాటు ప్రకారం నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఉపాధి పథకంలో అభివృద్ధి పనులు

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లి సచివాలయంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారులు, డ్రైన్లు, కాలువలు, చెరువు పనులకు అవకాశం ఉంటుందన్నారు.

ఊరకాలువలో పూడికతీత పనులు

మునగపాక: నాగులాపల్లిలో ఊరకాలువ పూడిక తీత పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ జామి చినమ్మలు విజ్ఞప్తితో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) 15వ ఆర్థిక సంఘం నిధులతో కాలువ పూడికతీత పనులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి.

పూరిల్లు దగ్ధం



యలమంచిలి(అనకాపల్లి రూరల్): కొర్లు కూడలి వద్ద ఓ పూరిల్లు అగ్నికి ఆహుతయింది. బుధవారం రాత్రి 10.40 గంటల సమయంలో ఇక్కడ నివాసం ఉంటున్న వృద్ధురాలు సావిత్రికి చెందిన తాటాకుల ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన వృద్ధురాలు,ఆమె కుమార్తె, మనవడు, మనవరాలు బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. అగ్నిమాపక శకటంతో చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు, దుస్తులు, విద్యార్హత సర్టిఫికెట్లు దగ్ధమైనట్టు బాధితులు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు

రాంబిల్లి : జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ అన్నారు. రాంబిల్లిలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి చేసిన జగనన్నకు అండగా నిలవాలన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేస్తే పథకాలు కొనసాగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ, సంక్షేమం, అభివృద్ధి డేటా బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కావిరి రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

రాంబిల్లి: దిమిలిలో ఈ నెల 24న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నట్లు సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 28న నిర్వహించే దల్లమాంబ జాతర సందర్భంగా ఈ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ పోటీల గోడపత్రికను ఆవిష్కరించారు. పోటీల్లో గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, ద్వితీయస్థానంలో రూ. 12వేలు, తృతీయ స్థానంలో రూ.10వేలు, నాలుగో స్థానం రూ.8వేలు అందజేయడం జరుగుతుందన్నారు.